బీచ్‌రోడ్డులో వెలుగు జిలుగులు

- రూ.3.30 కోట్లతో 260 విద్యుత్ స్తంభాల ఏర్పాటు
- భీమిలి టౌన్ నుంచి రామాద్రి వరకు పది కిలోమీటర్ల మేర సెంట్రల్ లైటింగ్


కాంతులీనుతున్న కాపులుప్పాడ కూడలి


జగ్గారావు తోట వద్ద రహదారిపై పరుచుకున్న వెలుగులు


భీమిలి సమీపంలో విద్యుత్ వెలుగులు

ఇది కదా అభివృద్ధి


ఎర్రమట్టి దిబ్బల వద్ద రహదారిపై వెలుగులు

తగరపువలస: బీచ్‌రోడ్డు విద్యుత్ దీప కాంతులతో వెలుగులీనుతోంది. విద్యుత్ వెలుగుల కారణంగా రాత్రివేళల్లో కూడా భీమిలి – విశాఖ బీచ్‌రోడ్డు పట్టపగలులా కనిపిస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యాటక రంగానికి అధిక ప్రాధాన్యత కల్పించారు. అందులో భాగంగా జీవీఎంసీ భీమిలి జోన్ పరిధిలో భీమిలి టౌన్ నుంచి రామాద్రి వరకు పది కిలోమీటర్ల పరిధిలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. రూ.3.30 కోట్లతో సుమారు 260 స్తంభాలు ఏర్పాటు చేసి రహదారులకు ఇరువైపులా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. దీంతో ఈ మార్గంలో రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గిపోయాయి. చీకటి పడిన తర్వాత కూడా ఈ విరజిమ్ముతున్న వెలుగుల కారణంగా వాహనాలు రయ్ మంటూ సాగిపోతున్నాయి. గత ప్రభుత్వాల హయాంలో చీకట్లు కారణంగా సాయంత్రమైతే బీచ్ రోడ్డులో ప్రయాణాలంటేనే ఈ ప్రాంతవాసులు హడలిపోయేవారు. ఇప్పుడు ఈ బీచ్‌రోడ్డులో పర్యాటకులే కాకుండా విద్యార్థులు, వ్యాపారులు, రోజువారీ కూలీలు, ఉద్యోగులు నిర్భయంగా రాకపోకలు సాగిస్తున్నారు.


మార్లిన్ క్లే హోటల్ మార్గంలో విద్యుత్ స్తంభాలు

బీచ్‌రోడ్డులో పెరిగిన పర్యాటకులు

విశాఖ నుంచి కూడా బీచ్‌రోడ్డులో విద్యుత్ దీపాల ఏర్పాటుతో... ఆ వెలుతురులో భీమిలి బీచ్ అందాలు తిలకించడానికి పర్యాటకులు ఉవ్విళ్లూరుతున్నారు. భీమిలిలో లైట్‌హౌస్, ఎర్రమట్టి దిబ్బలు, కంటెయినర్ హోటళ్లు, రామాద్రి, తొట్లకొండ, సీ వ్యూ పార్కు, రామానాయుడు స్టూడియో, బావికొండ, పావురాల కొండ, ఐఎన్‌ఎస్ కళింగ, రుషికొండ, తిమ్మాపురం, మంగమారిపేట కూడళ్లలో బీచ్ అందాలు రాత్రివేళ కూడా పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి. ఆర్టీసీ కూడా రాత్రి 11 వరకు బీచ్‌రోడ్డులో భీమిలి వరకు బస్సులు నడుపుతుండడంతో పేద ప్రజలు కూడా బీచ్ అందాలను రాత్రివేళ వీక్షిస్తూ ముగ్ధులవుతున్నారు. విశాఖ నుంచి మధురవాడ జాతీయ రహదారి మీదుగా కంటే బీచ్‌రోడ్డులో ప్రయాణం హాయిగొలుపుతుండటంతో సొంత వాహనాలు కలిగిన వారు ఈ మార్గాన్ని ఎన్నుకుంటున్నారు. మత్స్యకారులకు కూడా ఈ మార్గంలో 24 గంటలు సీ ఫుడ్స్ రవాణాకు బీచ్‌రోడ్డు వెలుగులు దోహదపడుతున్నాయి.

ఐదేళ్లలో ఎంతోమార్పు


ఈ అయిదేళ్లలో బీచ్‌రోడ్డులో జరిగిన అభివృద్ధి కేవలం సీఎం జగన్ వల్లే అని ఖచ్చితంగా చెప్పగలం. గత ప్రభుత్వాలు బీచ్‌రోడ్డు అభివృద్ధికి హామీలు ఇచ్చినా చీకటిలోనే ఎళ్ల తరబడి భీమిలితోపాటు ఇక్కడి ప్రజలను ఉంచేశారు. గత పాలకులు కనీస అభివృద్ధి కూడా చేయలేదు.

– మద్ది మహాలక్ష్మి, భీమిలి

విశాఖతో పోటీపడి అభివృద్ధి


విశాఖపట్టణంతో పోటీపడి భీమిలి అభివృద్ధి చెందింది. ఇందులో బీచ్‌రోడ్డులో వెలుగులు ప్రధానపాత్ర వహించాయి. విశాఖ పరిపాలన రాజధాని అయితే అందులో భీమిలి కీలకమని మన సీఎం జగన్ చెప్పారు. అందుకు సరిపడా అవకాశం భీమిలికే ఉంది.

– జీరు పద్మ, తగరపువలస

ఆటో ప్రయాణికులు పెరిగారు


అయిదేళ్ల క్రితం బీచ్ రోడ్డులో భీమిలి, తగరపువలసకు ప్రయాణమంటే ఎవరూ సాహసించేవారు కాదు. ఈ ప్రాంతమంతా చీకటిగా ఉండేది. ఇప్పుడు భీమిలి నుంచి విశాఖ వరకు రాత్రి వేళ కూడా పగలుగా కనిపిస్తోంది. ఇప్పుడు ఈ మార్గంలో ప్రయాణాలకు చాలామంది ఇష్టపడుతున్నారు.

– సీలాపు రామిరెడ్డి, ఆటోడ్రైవర్

బీచ్ రోడ్డులో హాయిగా ప్రయాణం


ఇతర రాష్ట్రాల ప్రజలు కూడా భీమిలిని ఇష్టపడుతుంటారు. అలాంటిది బీచ్ రోడ్డు మార్గమంతా వెలుగులతో రాత్రి కూడా పగలును తలపించేలా వెలిగిపోతుండటంతో అందరూ ఈ మార్గంలో ప్రయాణించడానికి సంబరపడిపోతున్నారు. ఈ క్రెడిట్ అంతా వైఎస్సార్‌సీపీదే.

– ఆశి రమణ, మూలకుద్దు

క్లుప్తంగా

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలు వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

హిందీ పరీక్షల ఫీజు చెల్లింపునకు 31 వరకు గడువు

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచారసభ – చెన్నై 2024 ఫిబ్రవరిలో నిర్వహించే లోయర్, హయ్యర్ పరీక్షలకు అపరాధ రుసుము లేకుండా ఫీజు చెల్లించడానికి ఈ నెల 31 వరకు గడువు పెంచినట్టు భీమిలి ఆదర్శ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు. ఫీజు చెల్లింపు, ఉచిత శిక్షణ తదితర వివరాల కోసం 89856 47419, 89858 97419లో సంప్రదించాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ఆనందపురం : మండలంలోని శొంఠ్యాం ప్రధాన విద్యుత్ లైన్‌కు మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా సోమవారం పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని అధికారులు తెలిపారు. రామవరం, గంగసాని అగ్రహారం, మామిడిలోవ ప్రాంతాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకూ విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని అధికారులు కోరారు.

అక్రమ నిర్మాణం నిలపాలని ఫిర్యాదు

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస పంచాయతీ జాతీయ రహదారిని ఆనుకుని సర్వే నంబర్ 160 గ్రామకంఠంలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని కోరుతూ విజ్జపు చిన వెంకటరమణ భీమిలి మండల పరిషత్ అధికారులను ఆశ్రయించాడు. గతంలో జాతీయ రహదారుల విస్తరణ సమయంలో భూసేకరణకు నష్ట పరిహారం తీసుకున్న సూరిబాబు అనే వ్యక్తి ఇప్పుడు తనది కాని స్థలంలో దౌర్జన్యంగా ఇంటి నిర్మాణం చేపడుతున్నాడని వెంకటరమణ ఆరోపించారు. ఇప్పటికే ఈ ఆక్రమణపై భీమిలి న్యాయస్థానంలో వివాదం నడుస్తుందన్నారు. తదుపరి విచారణ 2024 జనవరి 4న ఉన్నందున ఈ వివాదం సమసిపోయే వరకు తాళ్లవలస పంచాయతీ, సచివాలయ సిబ్బంది జోక్యం చేసుకుని అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని కోరారు.

అమరేశ్వరునికి లక్ష రూపాయల విరాళం


ఆలయ ఈవో మేమూరి గోపీనాథశర్మకు విరాళం అందజేస్తున్న దాట్ల సూర్య అప్పలరాజు

అమరావతి: ప్రసిద్ధ శైవ క్షేత్రమైన అమరావతి అమరేశ్వరాలయంలో నిర్వహించే నిత్యాన్నదాన కార్యక్రమానికి విశాఖపట్నం జిల్లా భీమిలి వాస్తవ్యులు దాట్ల సూర్య అప్పలరాజు వారి ధర్మపత్ని దాట్ల అమ్మాజీ జ్ఞాపకార్థం రూ.1,00,116 విరాళంగా ఆదివారం సమర్పించారు. ఆలయంలో అమరేశ్వరునికి అభిషేకాలు, బాలచాముండేశ్వరిదేవి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అనంతరం ఈవో మేమూరి గోపీనాథశర్మకు దాట్ల సూర్యఅప్పలరాజు రూ.1,00,116 డీడీ అందజేశారు. కార్యక్రమంలో దేవాలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

రైతు గుండెల్లో మళ్లీ తుపాను అలజడి


పంటను పొలంలోనే దిబ్బ పెడుతున్న రైతులు


వరిపనలు ఒడ్డుకు చేర్చుకుంటున్న రైతులు

వరి పంటను రక్షించుకోవడానికి పరుగులు

ఆనందపురం : ఈ ఏడాది అన్నదాత ప్రకృతి ప్రకోపానికి గురై తీవ్ర కష్టాలు ఎదుర్కొంటున్నాడు. ఇటీవలే మిచాంగ్ తుపానుకు తీవ్రంగా నష్టపోయిన అన్నదాతను ఆదివారం నాటి వాతావరణ పరిస్థితులు కలవరపాటుకు గురి చేస్తున్నాయి. తమిళనాడు రాష్ట్రంలో మరలా తుపాను సంభవించి వర్షాలు కురుస్తుండడంతో ఆ ప్రభావం ఆంధ్రప్రదేశ్‌పై చూపిస్తుండడంతో అన్నదాతలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఆకాశం మేఘావృతమై ఉండి వర్షం కురిసే ఛాయలు కనిపిస్తుండడంతో రైతులు పొలాల్లోకి పరుగులు పెట్టి పంటను రక్షించుకునే పనిలో పడ్డారు. మిచాంగ్ తుపాను సంభవించిన సమయంలో 20 శాతం వరకూ కోతలు జరగ్గా మిగతా పంట పొలంపైనే ఉండిపోయింది. దీంతో నూర్చిన ధాన్యాన్ని రక్షించుకోవడానికి రైతులు అష్టకష్టాలు పడ్డారు. చాలా వరకు ధాన్యం పాడైపోయాయి. పొలంపై కోత కోయకుండా ఉన్న పంట నేలబారి నీట నానింది. తుపాను తెరిపివ్వడంతో నీట మునిగిన పంటను రక్షించుకొని కోత కోశారు. ప్రస్తుతం కోసిన వరి పనలు పొలంపైనే ఉన్నాయి. కాగా మరలా తుపాను సంభవించి వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రచారం జరుగుతుండడంతో రైతులు పొలంపై ఉన్న పంటను రక్షించుకోవడానికి దిబ్బలు పెడుతున్నారు. మరి కొంతమంది ఎత్తైన ప్రదేశాలకు వరి పనలను తరలిస్తున్నారు. ఒకేసారి అందరికీ కూలీలు అవసరం పడడంతో కొరత ఏర్పడింది. దీంతో ఇంటిళ్లపాది పొలాలకు చేరుకొని పంటను రక్షించుకునే పనిలో పడ్డారు. ఏది ఏమైనా ఈ ఏడాది అన్నదాతకు గడ్డుకాలంగా మారిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ పథకాలపై ఇంటింటా ప్రచారం


టి.నగరపాలెంలో ప్రచారంలో ఎంపీపీ దంతులూరి వాసురాజు, నాయకులు

తగరపువలస: 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ దంతులూరి వాసురాజు ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు. టీడీపీ హయాంలో సంక్షేమం, అభివృద్ధి, వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని వివరించి తేడా తెలుసుకోవాలని సూచించారు. సర్వే ద్వారా ప్రజల అభిప్రాయాలు నమోదు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, సర్పంచ్ పొట్నూరు ఛాయాగౌతమి, ఎంపీటీసీ సభ్యులు పల్లా నీలిమ, చెల్లూరి నగేష్‌బాబు, సీనియర్ నాయకులు దుంపల ప్రభాకర్, బాయిన మంగపతి, పొట్నూరు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతలకు ఘన స్వాగతం


కుంతీ మాధవ స్వామి ఆలయంలోకి కలశంతో అక్షింతలు తీసుకెళ్తున్న భక్తులు

పద్మనాభం: విశాఖపట్నంలోని అంబికాబాగ్ రామాలయం నుంచి ఎంపీపీ కంటుబోతు రాంబాబు, పలువురు భక్తులు ఆదివారం కలశంతో తీసుకొచ్చిన అయోధ్య శ్రీరామ పూజ అక్షింతలకు పద్మనాభం గ్రామంలో ఘన స్వాగతం పలికారు. అక్షింతల కలశను కుంతీ మాధవ స్వామి ఆలయంలోకి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఆలయంలో అక్షింతలను కొన్ని రోజులు ఉంచి ప్రత్యేక పూజలు జరుపుతారు. తర్వాత గ్రామాల్లోని రామాలయాల్లోకి తీసుకెళ్తారు. ఈ సందర్భంగా గంగాపురం మలయాళ లక్ష్మీ నారాయణ ఆశ్రమం ఉత్తర పీఠాధిపతి పరమాత్మ నందగిరి స్వామి మాట్లాడుతూ రాముడు జన్మించిన స్థలంలో రామాలయం నిర్మాణించాలనే కల 500 సంవత్సరాల తర్వాత సాకారమైందన్నారు. గతంలో అయోధ్యలో మసీదుకు వెళ్లి రాముడుని దర్శించుకోవాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు రామాలయంలోనే రాముడిని దర్శించుకునే భాగ్యం భక్తులకు కలుగుతుందన్నారు. రామాయణానికి, మానవ జీవితానికి దగ్గర సంబంధం ఉందన్నారు. దైవ కార్యక్రమాల్లో పాలు పంచుకున్నప్పుడే ముక్తి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పద్మనాభం సర్పంచ్ తాలాడ పాప, తాలాడ పద్మనాభం, కృష్ణాపురం ఎంపీటీసీ సభ్యురాలు కంటుబోతు లక్ష్మి, కంటుబోతు ఎర్నాయుడు, మొకర సన్నిబాబు, తాలాడ పైడిరాజు, తాలాడ నరసింహనాయుడు, గంగిరెడ్ల పద్మనాభస్వామి పాల్గొన్నారు.

భగవద్గీతపై విస్తృత ప్రచారం


భగవద్గీతపై ప్రచారం చేస్తున్న సభ్యులు

ఆనందపురం : ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుడు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రబోధ సేవా సమితి సభ్యులు ఆదివారం విస్తృతంగా ప్రచారం చేశారు. మార్గశిర, ధనుర్మాసాలను పురస్కరించుకుని సంచార వాహనంతో కుసులువాడ, రామునేనిపేట, ముకుందపురం గ్రామాల్లో గ్రంథాలతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూ జ్ఞాన వేదిక విజయరాంపురం కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు మాట్లాడుతూ గురు జ్ఞానాన్ని పొందిన శిష్యుడు కార్తీక మాసంలో దీపపు వెలుగు అనే యోగ మార్గంలో ప్రయాణించి, మార్గశిర మాసంలో తలలోని ఆత్మ వద్దకు చేరుకొని జ్ఞాన సంపన్నుడు అవుతాడని బోధించారు. దైవభక్తితో గ్రంథపఠనం చేయాలని సూచించారు. అనంతరం త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలను భక్తులకు అందజేశారు. కమిటీ సభ్యులు జి.కృష్ణ సూరప్పుడు, ఎస్.శ్రీనివాస్, వి.భవానీ తదితరులు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం


బీచ్‌రోడ్డులో బోల్తా పడిన లారీ

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డులో పెను ప్రమాదం తప్పింది. ఎండాడ జాతీయ రహదారి నుంచి భీమిలి బీచ్ వైపుగా అతి వేగంగా వస్తున్న లారీ ఆదివారం తెల్లవారుజామున చినరుషికొండ జంక్షన్ వద్ద డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ క్రమంలో డివైడర్ పూర్తిగా ధ్వంసమైపోయింది. తెల్లవారుజాము కావడంతో జనసంచారం లేకపోవడంతో పెను ప్రమాదమే తప్పింది. ప్రస్తుతం లారీ డ్రైవర్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

అయ్యప్ప సన్నిధిలో ముత్తంశెట్టి


మాజీ మంత్రి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శబరిమల అయ్యప్ప స్వామిని ఆదివారం దర్శించుకున్నారు. కొద్దిరోజుల కిందట అయ్యప్పస్వామి మాలధరించిన ఆయన శబరిమల చేరుకుని ఇరుముడి సమర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.

– తగరపువలస

20న పెన్షనర్ల రాస్తారోకో


మాట్లాడుతున్న రాష్ట్ర సంఘం అధ్యక్షుడు సుధాకర్

తగరపువలస: రాష్ట్ర వ్యాప్త నిరసన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 20న లేబర్ వెల్ఫేర్ సెంటర్ నుంచి నిర్వహించనున్న రాస్తారోకోలో పెన్షనర్లంతా పాల్గొనాలని రాష్ట్ర పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు సుధాకర్ కోరారు. పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా ఆదివారం చిట్టివలస జ్యూట్‌మిల్లు కల్యాణ మండపంలో చిట్టివలస ప్రాంత ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పెన్షనర్ల కోసం జరుగుతున్న పోరాటాలను వివరించారు. కనీస పెన్షన్ రూ.9వేలతోపాటు రైళ్ల ప్రయాణంలో సీనియర్ సిటిజన్స్‌కు రాయితీ, ఈఎస్‌ఐ ఆస్పత్రుల ద్వారా హెల్త్ సౌకర్యం కోసం అందరూ పోరాటం చేయాలన్నారు. పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు అల్లు బాబూరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నాయకులు కొండపు ఈశ్వరరావు, ఎస్.అప్పలనాయుడు, ఎం.దేవుళ్లు, కె.రాంబాబు, ఎం.అప్పలరాజు, మావూరి వీర్రాజు, దామోదర బాబాజీ తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం నేడు

పద్మనాభం: మండలంలోని కోరాడ పంచాయతీ గెద్దపేటలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సహిత శ్రీలక్ష్మి గణపతి ఆలయంలో సోమవారం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్టికి ఏర్పాట్లు చేశారు. ముందుగా గణపతి పూజ, స్వామి వారికి విశేష అభిషేకం, పుణ్యాహవచనం జరుపుతారు. అనంతరం కల్యాణం నిర్వహిస్తారు.

ధనుర్మాస పూజలు ప్రారంభం


భీమిలి కృష్ణాకాలనీ కొండపై పూజలందుకున్న కల్యాణ వేంకటేశ్వరస్వామి

భీమునిపట్నము: స్థానిక కృష్ణాకాలనీ కొండపై వెలసిన కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి, కమిటీ సభ్యులు పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

- ధనుర్మాసం ప్రారంభం కావడంతో మధురవాడలోని వివిధ వైష్ణవ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయాలకు భక్తులు విశేషంగా తరలివచ్చారు. మధురవాడ సిద్ధేశ్వర పీఠంతోపాటు ఇతర ఆలయాల్లో రోజూ ప్రత్యేక పూజలు చేస్తామని నిర్వాహకులు చెప్పారు.

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో ఆదివారం నుంచి ధనుర్మాసోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా స్వామికి అభిషేకాలు చేశారు. అనంతరం అర్చక స్వాములు రుక్మిణి, సత్యభామ, వేణుగోపాలస్వామి, గోదాదేవికి బేడా సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయంలో నగర సంకీర్తన నిర్వహించారు.

పది మంది పేకాట రాయుళ్ల అరెస్ట్

పీఎం పాలెం: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతున్న పది మందిని పీఎం పాలెం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ సురేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... జీవీఎంసీ ఆరో వార్డులోని వికాలంగుల కాలనీలో పేకాట ఆడుతున్నట్టు సమాచారం అందగా సోమవారం సాయంత్రం 6 గంటలకు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, పోలీసులు సంయుక్తంగా దాడి చేశారు. పది మందిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.42 వేలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

ముక్కోటి ఏకాదశికి పటిష్ట ఏర్పాట్లు


భాస్కరరెడ్డికి ఏర్పాట్లను వివరిస్తున్న దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు, ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: ఈనెల 23న ముక్కోటి ఏకాదశి సందర్భంగా సింహగిరిపై జరుగుతున్న ఏర్పాట్లను ఆదివారం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తితో కలిసి భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డి పరిశీలించారు. ఆ రోజు ప్రముఖుల తాకిడి ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుందని.. అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేయాలని సూచించారు. చందనోత్సవంలో ప్రముఖులకు సరైన ఏర్పాట్లు చేయలేదన్న అపవాదు రావడంతో ఈసారి ముక్కోటి ఏకాదశికి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రముఖుల దర్శనాల క్యూ ప్రత్యేకంగా ఏర్పాటు చేసి సాధారణ భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్టు ఈవో శ్రీనివాసమూర్తి తెలిపారు. వీఐపీలు దర్శనానికి వచ్చినప్పుడు దేవస్థానం, రెవెన్యూ అధికారుల మధ్య లైజనింగ్ ఉండేలా చూసుకోవాలని సూచించారు. చినగదిలి తహసీల్దార్ రమణయ్య, దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు, ఏఈవో పాలూరి నరసింగరాజు పాల్గొన్నారు.

వసతులు కల్పించాలని వినతి

తగరపువలస: బీచ్‌రోడ్డులోని రుషికొండ వద్ద ఉన్న గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా టీటీడీ వసతులు కల్పించాలని నగరానికి చెందిన సామాజిక కార్యకర్త జి.అప్పన్న కోరారు. ఈ మేరకు టీటీడీకి లేఖ రాశారు. ఈ నెల 23న వైకుంఠ ఏకాదశి, ద్వాదశి వేళల్లో భక్తులకు తిరుమల నుంచి చిన్న, పెద్ద లడ్డూలు, వడ ప్రసాదాలు అందుబాటులో ఉంచి విక్రయించాలని కోరారు. నిత్య ఆర్జిత సేవలు, అన్నప్రసాద వితరణ, వసతి సదుపాయాలు, కేశఖండన శాల ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికే ఈ విషయాలపై డయల్ యువర్ ఈవో ద్వారా టీటీడీకి ఫిర్యాదు చేశామన్నారు. శ్రీవారి భక్తులకు సేవలు, ఆలయ అభివృద్ధికి, హిందూ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.